నేడు పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

దామెర/హనుమకొండ/శాయంపేట, నవంబర్ 8 : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా శనివారం పలు చోట్ల సరఫరా నిలిపివేయనున్నారు. దామెర మండలంలోని ఊరుగొండ సబ్‌స్టేషన్ పరిధి ఊరుగొండ, పసరగొండ, పులుకుర్తి, దుర్గంపేట, సీతారాంపురం గ్రామాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ గుర్రం రమేశ్ తెలిపారు. అలాగే, హనుమకొండలోని ఆర్ఈసీ సబ్ స్టేషన్ పరిధిలోని చైతన్యపురికాలనీ, బ్యాంక్ కాలనీ, టీచర్స్ కాలనీ ఫేజ్ 2లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మచిలీబజార్ సబ్ స్టేషన్ పరిధిలోని కాపువాడ, అలంకార్ సర్కిల్, కాకాజీకాలని, గుండం, విజయ డెయిరీ, ఉర్జీ, ఘడీ మసీద్, జమ్మా మసీద్‌తోపాటు కేయూసీ సబ్ స్టేషన్ పరిధిలోని నయీంనగర్, సింగారం, పోలీస్ హెడ్‌క్వార్టర్స్, వాగ్దేవి కాలేజీ ఏరియాలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, గోపాల్‌పుర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, పెద్దమ్మగడ్డ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 10.30 వరకు, రాంపుర్, మడికొండ, సోమిడి సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు హనుమకొండ టౌన్ ఆపరేషన్ డీఈ జీ సాంబారెడ్డి తెలిపారు. అలాగే, శాయంపేట, కొప్పుల సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ చందులాల్ తెలిపారు.

11న కేయూలో బాలగోపాల్ స్మారక ఉపన్యాసం

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 8 : కేయూలో ఈ నెల 11న కే బాలగోపాల్ 14వ స్మారక ఉపన్యాస కార్యక్రమం ఉదయం 11 గంటలకు సెనేట్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో విశాఖపట్నానికి చెందిన న్యాయవాది జహా ఆరా పాల్గొని 'స్త్రీల హక్కులు.. న్యాయ వ్యవస్థ పాత్ర' అనే అంశంపై ఉపన్యసిస్తారన్నారు.

26 మందికి జరిమానా

సుబేదారి, నవంబర్ 8 : హనుమకొండ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 29మందికి రూ.33,500 జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, పరకాల అలియాబాద్‌కు చెందిన ముప్పు సునీల్, హనుమకొండ గుండ్లసింగారానికి చెందిన ధరావత్ బాలుకు రెండు రోజుల కమ్యూనిటీ సర్వీసింగ్‌కు ఆదేశించినట్లు చెప్పారు.

ఆర్డీవోను కలిసిన 'సీనియర్ సిటిజన్స్'

హనుమకొండ, నవంబర్ 8 : ఇటీవల హనుమకొండ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన రమేశ్ రాథోడ్‌ను సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ అనితారెడ్డి, సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ట్రిబ్యునల్ కోర్టుకు వస్తున్న కేసులు, పని చేసిన తీరును అనితా రెడ్డి వివరించారు. అనంతరం సీనియర్ సిటిజన్స్ నడిపిస్తున్న సీనియర్ సిటిజన్స్ మాస పత్రికను ఆర్డీవోకు అందజేశారు.ఫోరం అధ్యక్షుడు చంద్రమౌళి, సభ్యులు దేవాచారి, సరళాకుమారి, రజినీకాంత్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED HELPERS
jobs Apply Now!
★హైదరాబాద్ నందు 5 స్టార్ హోటల్‌లో పని చేయుటకు
''హెల్పర్లు'' కావలెను. 12 గంటల డ్యూటీ, 18,000/- జీతం, రూమ్+ఫుడ్ ఫ్రీ. వయస్సు: 18-30 సం॥లు.
No Consultency, Direct Job. Contact: 9885283513.
NT-335863_All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

శంకుస్థాపన చేశారు.. రోడ్డు వేయడం మరిచారు

నెలలు గడిచినా అటువైపు కన్నెత్తి చూడని ఎమ్మెల్యే, నాయకులు

హసన్‌పర్తి, నవంబర్ 8 : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆర్భాటంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మండలంలోని జయగిరిలో తన సీడీఎఫ్ నిధుల నుంచి రూ.4.99 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి మార్చి 15 తేదీన భూమి పూజ చేశారు. నెలలు గడిచినా సీసీ రోడ్డు మాత్రం వేయడం లేదు. శంకుస్థాపన చేసిన రోజు నుంచి ఆటువైపు ఎమ్మెల్యే నాగరాజు కానీ కాంగ్రెస్ నాయకులు కానీ చూసిన దాఖలాలు తేవని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 11నెలలు గడిచినా గ్రామంలో తట్టెడు మట్టికూడా పోయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే గ్రామాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు కానీ స్థానిక నాయకులు ఆ మాట మరిచారన్నారు. శిలాఫలకం చుట్టూ, దారి పొడవునా పిచ్చిమొక్కలు మొలిచి అటు వెళ్లాలంటేనే కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు ఎమ్మెల్యే నాగరాజు దృష్టికి తీసుకుపోయి వెంటనే సీసీరోడ్డు పనులు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

శిలాఫలకం చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

133 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్న పోలీసులు

ఐనవోలు/నయీంనగర్/నడికూడ, నవంబర్ 8 : జిల్లాలో వేర్వేరు చోట్ల మొత్తం 133 క్వింటాళ్ల రేషన్ బియాన్ని టాస్క్‌ఫోర్స్, పోలీసులు కలిసి పట్టుకున్నారు. ఐనవోలు మండలంలో అక్రమంగా నిల్వ చేసిన 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. పంథిని శివారులోని గర్వల్‌రాజ్ పౌల్ట్రీ ఫామ్‌లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు వచ్చిన సమాచారంతో స్థానిక పోలీసులతో కలిసి సోదాలు నిర్వహించిగా 8 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ బియ్యం విలువ సుమారు రూ. 20 వేల వరకు ఉంటుందన్నారు. రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని గర్వల్‌రాజ్‌పై కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు. కోమటిపల్లిలోని మధుతండాలో దాడులు చేసి అక్రమంగా నిల్వచేసిన రూ.లక్ష విలువైన 40క్వింటాళ్ల బియ్యంతో పాటు ఆటోను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సీజ్ చేశారు. నిందితులు మాలోత్ రవి, రమాదేవి, మడికొండకు చెందిన రామరాజు, పవన్ కుమార్, శైలజ, మురళిని కేయూసీ పోలీసులకు అప్పగించారు. పరకాల పోలీసులు నడికూడ మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన పర్శవేని కుమారస్వామి, తూర్పాటి శ్రీధర్, తూర్పాటి ఐలయ్య వద్ద సోదాలు చేసి రూ. 2,21,000 విలువైన దాదాపు 85 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై శివకృష్ణ తెలిపారు. బియ్యాన్ని పరకాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాడుల్లో భాస్కర్, దేవేందర్, దయాకర్ పాల్గొన్నారు.

అంబర్, గుట్కా ప్యాకెట్ల పట్టివేత

గుట్కాలు పట్టుకున్న పోలీసులు

కమలాపూర్, నవంబర్ 8 : మండల కేంద్రంలో కిరాణాషాపుల్లో అక్రమంగా అమ్ముతున్న నిషేధిత అంబర్, గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నట్లు సీఐ హరికృష్ణ శుక్రవారం తెలిపారు. కమలాపూర్‌లోని చేరాల రమేశ్, వేముల వీరస్వామి కిరాణా షాపుల్లో అంబర్, గుట్కా ప్యాకెట్లు అమ్ముతున్నారనే సమాచారం మేరకు తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. రూ.7,865 విలువైన అంబర్, గుట్కా ప్యాకెట్లు దొరికినట్లు తెలిపారు. రమేశ్, వీరస్వామిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాజీపేట, నవంబర్ 8 : రైలు ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన కాజీపేట- హసన్‌పర్తి రైల్వేస్టేషన్ల మధ్య శుక్రవారం జరిగింది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొమటిపల్లి సమీపంలోని రైలు పట్టాల వెంట తిరుగుతున్న మతిస్థిమితం లేని ఓ వ్యక్తిని రైలు ఢీకొట్టడంతో మృతిచెందాడు. మృతుడి వయసు దాదాపు 50సంవత్సరాలు ఉంటుందని, నీలం రంగు షార్టు, ముదురు ఆకుపచ్చ రంగు షర్టు ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం దవాఖాన మార్చురీలో భద్రపరిచామన్నారు. మృతుడికి ఎవరైనా సంబంధీకులుంటే కాజీపేట జీఆర్పీ లేదా 8712568496లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో కార్యదర్శికి గాయాలు

శాయంపేట, నవంబర్ 8 : రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శికి గాయాలైన ఘటన శాయంపేటలో శుక్రవారం జరిగింది. శాయంపేటకు చెందిన రాజశేఖర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లిలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. ఇక్కడి నుంచి రోజు విధులకు హాజరవుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో శుక్రవారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బీసీ కాలనీలో కుక్క అడ్డు రావడంతో కింద పడి గాయాలైనట్లు స్థానికులు చెప్పారు. వెంటనే స్థానికులు కార్యదర్శిని ఆస్పత్రికి తరలించారు.

ముగ్గురు గుడుంబా విక్రేతల బైండోవర్

అరెస్టును చూపుతున్న పోలీసులు

శాయంపేట, నవంబర్ 8 : గుడుంబా అమ్ముతున్న ఇద్దరిని అరెస్టు చేయడంతో పాటు గతంలో ముద్దాయిగా ఉన్న ఒకరిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీ శుక్రవారం తెలిపారు. పెద్దకోడెపాక గ్రామంలో గుడుంబా అమ్ముతున్న పాలకుర్తి సారయ్య, కోగిల సమ్మమ్మను అరెస్ట్ చేసి 12 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం వీరిని తాసీల్దార్ సత్యనారాయణ ఎదుట బైండోవర్ చేశారు. అలాగే గంగిరెణిగూడెం గ్రామానికి చెందిన మాలోత్ దేవుసింగ్‌నూ బైండోవర్ చేసినట్లు చెప్పారు. ఎక్సైజ్ ఎస్సై సులోచన, కానిస్టేబుళ్లు విజయ్‌కుమార్, రవీందర్ ఉన్నారు.

అవగాహన కల్పిస్తున్న సీఐ చేరాలు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

హసన్‌పర్తి, నవంబర్ 8 : మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి సీఐ చేరాలు ఆధ్వర్యంలో పోలీస్ కళాజాత నిర్వహించారు. డ్రగ్స్, గుట్కా, మత్తు పదార్థాలు, మూఢ నమ్మకాలు, మ్యాజిక్ షో తదితర అంశాలపై పాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, బాల్యవివాహాలు, 100 డయల్, సీసీ కెమెరాలు, 1930 హెల్ప్‌లైన్ నంబర్‌పై అవగాహన కల్పించారు. అలాగే గంజాయి అమ్మినా, సేవించినా 8712584473 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హ్యూమన్‌రైట్స్ ట్రాఫికింగ్ యూనిట్ సీఐ వెంకన్న, ఎస్సై దేవేందర్, కళాబృందం ఇన్‌చార్జి నాగమణి, హెచ్‌సీఎస్ విలియమ్, సభ్యులు వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్, రాజు, చిరంజీవి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు నియామకాలు నిలిపివేయాలి

మాట్లాడుతున్న మంద కుమార్ మాదిగ

హనుమకొండ/ధర్మసాగర్, నవంబర్ 8 : అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ అమల్లోకి తీసుకువచ్చిన తర్వాతే ఉద్యోగాలు భర్తీ చేయాలని ఎమ్మెస్పీ జాతీయ నేత మంద కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్రా భిక్షపతి మాదిగ డిమాండ్ చేశారు. నక్కలగుట్టలోని హరిత హోటల్‌లో ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో, ధర్మసాగర్‌లోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా 11వేల టీచర్ పోస్టులు భర్తీ చేసి మాదిగలకు సీఎం ద్రోహం చేశారని మండిపడ్డారు. ఎస్సీ కేటగిరిలోని టీచర్ పోస్టుల్లో 80శాతాకి పైగా మాలలకే చెందాయన్నారు. రేవంత్ రెడ్డి మాలల ఒత్తిడికి తలొగ్గి ఎస్సీ కేటగిరి ఉద్యోగాలను మాలలకు దోచిపెడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం నవంబర్ రెండో వారంలో అన్ని నియోజక వర్గ కేంద్రాల్లో నిరాహార దీక్షలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అలాగే నవంబర్ 16న మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మాదిగల ధర్మయుద్ధ రథయాత్ర ప్రారంభమవుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజుల పాటు కొనసాగుతుందన్నారు. డిసెంబర్ 21న లక్షలాది మందితో హైదరాబాద్‌లో మాదిగల ధర్మయుద్ధ ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జాతీయ నాయకులు వేల్పుల సూరన్న మున్నూరు కాపు, బొడ్డు దయాకర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్, జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ పాల్గొన్నారు.

మాలలను ఇంకెంతకాలం అణచివేస్తారు?

- **కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో రేవంత్‌ను తరిమికొట్టాలి**
- **పాదయాత్రలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్**


మాట్లాడుతున్న పిల్లి సుధాకర్

ఎల్కతుర్తి, నవంబర్ 8 : దళితులకు రాజ్యాధికారం దక్కకూడదనే కుట్రతోనే ఎస్సీలను ఏబీసీడీగా వర్గీకరణ చేస్తున్నారని, మాలలను ఇంకెంతకాలం అణచివేస్తారని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మండిపడ్డారు. మాలమహానాడు పాదయాత్ర శుక్రవారం ఎల్కతుర్తి మండలంలోకి ప్రవేశించింది. భావుపేటలో ఆయన మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ ప్రధాని నరేంద్రమోదీ కౌగిలిలో ఇరుక్కుని మనువాదుల ఏజెంట్‌గా మారాడని ఆరోపించారు. న్యాయస్థానం తీర్పు ఇచ్చిన వెంటనే రాష్ట్రంలో వర్గీకరణ సాధ్యమా? లేదా? అనే విషయన్ని పక్కనపెట్టి అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. రాష్ట్రంలో మాలలు, మాదిగల జనాభా దాదాపు సరిసమానంగా ఉందని, మాలలను తక్కువ చేసి చూపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో మోదీని, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డిని తరిమికొట్టేందుకు మాలలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పాదయాత్ర వచ్చేనెల ఒకటో తేదీన హైదరాబాద్ చేరుకుంటుందని, అక్కడ నిర్వహించే మాలల సంగ్రామయాత్రకు మాలలు, మాలల ఉపకులాలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు మర్రి వెంకటస్వామి, మాల మహానాడు నాయకులు మేడి అంజయ్య, దామెర సత్యం, ఇరుకుల్ల యాదగిరి, డబ్బ రవి, వెంకటస్వామి పాల్గొన్నారు.

చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ధర్మసాగర్, నవంబర్ 8 : స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ సదానందం అధ్యక్షతన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ధర్మసాగర్ మండలంలోని 19 గ్రామాలకు చెందిన 62 మందికి, కాజీపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన 12 మందికి చెక్కులను పంపిణీ చేశారు. ఆర్డీవో రమేశ్, కాజీపేట తహసీల్దార్ బావ్‌సింగ్, ఎంపీడీవో అనిల్ కుమార్ పాల్గొన్నారు. అలాగే, మండలంలోని రాయగూడెంలో సరస్వతీ మాత ఆలయం ఆర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆలయ వ్యవస్థాపకులు రామగిరి సోమలింగం, సోమలక్ష్మి పాల్గొన్నారు.

కాజీపేటలో వాహనాల వరుస చోరీలు

పనిచేయని సీసీ కెమెరాలు.. లబోదిబోమంటున్న బాధితులు

కాజీపేట, నవంబర్ 8 : కాజీపేటలో వరుస వాహనాల చోరీలతో ప్రజలు బెంబేలెత్తున్నారు. పట్టణంలో ఇటీవల ఇళ్లు, షాపుల ముందు పార్కు చేసిన వాహనాలను గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోతున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి వారాలు, నెలలు గడుస్తున్నా నిందితులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇటీవల పట్టణానికి చెందిన భగవాన్ ఉపాధ్యాయ అనే వ్యాపారి రాత్రి తన ఇంటి ముందు బైక్‌ను పార్కు చేశాడు. తెల్లవారే సరికి బైక్ చోరీకి గురైంది. అలాగే, ఓ దిన పత్రిక విలేకరి రవి తన బైక్‌ను రైల్వే జంక్షన్ ప్రాంగణంలో పెట్టి స్టేషన్‌లోకి వెళ్లి వచ్చే సరికి మాయమైందని వాపోయాడు. మడికొండకు చెందిన ఆటో డ్రైవర్ తన కిరాయి ఆటోను కాజీపేటలోని డీలక్స్ బార్ ముందు పార్కు చేసి, గంట తర్వాత వచ్చి చూసే సరికి ఆటో కనిపించకుండా పోయింది. ఇటీవల వైఎస్సార్ నగర్, మల్లికార్జునస్వామి ఆలయం ప్రాంతంలో ఓ వ్యక్తికి చెందిన బైక్‌లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు. కొన్ని రోజుల క్రితం జూబ్లీ మార్కెట్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ తన ఆటోను రాత్రి తన ఇంటి ముందు పార్కు చేసి, ఉదయం లేచేసరికి కనిపించలేదు. ప్రస్తుతం ఆటో హైదరాబాద్ ప్రాంతంలో తిరుగుతోందని, ట్రాఫిక్ చలాన్లు సెల్‌ఫోన్‌కు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. జల్సాలకు అలవాటు పడిన యువత డబ్బులు సంపాదించాలని ఇలాంటి దొంగతనాలకు పాల్పడుతుండవచ్చని వివిధ కాలనీల ప్రజలు అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో శాంతి భద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు కీలకంగా మారాయి. కొంతకాలంగా పట్టణంలోని ముఖ్య ప్రాంతాల్లోని కొన్ని సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో నేరస్తులను పట్టుకోవడం పోలీసులకు తలనొప్పిగా మారింది.

ఎర్రకుంట ఆక్రమణపై విజిలెన్స్ అధికారుల విచారణ

కమలాపూర్, నవంబర్ 8 : మండల కేంద్రంలోని ఎర్రకుంట చెరువు ఆక్రమణపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం విచారణ జరిపినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండల కేంద్రంలోని కమలాపూర్-పంగిడిపల్లి రహదారి పక్కన ఉన్న ఎర్రకుంట చెరువు గ్రామంలో కలిసిపోవడంతో కబ్జా చేసి ఇండ్ల నిర్మాణాలు, ప్లాట్లు పెట్టి అమ్మకాలు చేస్తున్నారు. లక్షల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని ఫిర్యాదు చేయగా, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే నంబర్ 836, 27లోని భూములను పరిశీలించారు. ఎర్రకుంట చెరువు కట్ట, తూం, చెరువులో ఎఫ్‌టీఎల్ పరిధిని చూశారు. చెరువు నుంచి 30ఎకరాల ఆయకట్టుకు వెళ్లే కాల్వ కబ్జాకు గురైందని, దీనిపై పూర్తి నివేదికను అందజేయాలని సాగునీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. చెరువు పరిధిలో ఎంత ప్రభుత్వ భూమి ఉంది. బఫర్‌జోన్‌లో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణపై విచారణ చేసినట్లు తెలిపారు.

ఆందోళన చేస్తున్న రైతులు

కల్తీ విత్తనాలతో నష్టపోయాం

దుకాణం ఎదుట రైతుల ఆందోళన

శాయంపేట, నవంబర్ 8 : జై శ్రీరాం విత్తనాలతో కల్తీ జరిగి నష్టపోయామని తమను ఆదుకోవాలని రైతులు వేడుకున్నారు. మండలంలోని హుస్సేన్‌పల్లి గ్రామానికి చెందిన రైతులు శాయంపేటలోని సాయి ఫర్టిలైజర్ దుకాణం నుంచి యశోద కంపెనీకి చెందిన జైశ్రీరాం వరి విత్తనాలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందులో నలబై శాతం కల్తీ విత్తనాలు ఉన్నాయని, దీంతో పంట ఎదగలేదని చెప్పారు. న్యాయం చేయాలని విత్తనాలు కొన్న దుకాణం నిర్వాహకుడిని శుక్రవారం కలిశారు. కంపెనీ వారిని పిలిపిస్తామని నిర్వాహకుడు చెప్పినట్లు తెలిపారు. అయితే పదిహేను రోజులుగా దుకాణాదారుడు తిప్పుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు రైతులు ఆరోపించారు.

ముగిసిన ఎమ్మెల్సీ ఓటరు దరఖాస్తు గడువు

- **జిల్లాలో 5,595 మంది అప్లికేషన్**
- **23న ముసాయిదా ఓటరు జాబితా వెల్లడి**
- **డిసెంబర్ 30న తుది జాబితా ప్రకటన**

హనుమకొండ, నవంబర్ 8 : వచ్చే ఏడాది నిర్వహించనున్న వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయుల శాసన మండలి నియోజకవర్గం ఎన్నికల ఓటరు నమోదు దరఖాస్తు గడువు బుధవారంతో ముగిసింది. ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకొనేందుకు హనుమకొండ జిల్లాలోని 14 మండలాల పరిధిలో 5,595 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం దరఖాస్తులను పరిశీలించిన తర్వాత అర్హులకు ఓటు హక్కు కల్పించనున్నారు. కాగా, వచ్చే ఏడాది మార్చి 29తో వరంగల్-ఖమ్మం-నల్గొండ శాసన మండలి ఉపాధ్యాయుల నియోజకవర్గం ఎమ్మెల్సీ పదవి కాలం పూర్తవుతున్న నేపథ్యంలో ఏర్పడే ఖాళీని భర్తీ చేసేందుకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ మేరకు ఓటర్ల జాబితా తయారీకి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. దీని ప్రకారం గడువులోగా చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి అర్హులను గుర్తించి ఈ నెల 23న ముసాయిదా ఓటరు జాబితాను వెల్లడించనున్నారు. అప్పటి నుంచి డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. డిసెంబర్ 25 నాటికి అభ్యంతరాలను పరిశీలించి డిసెంబర్ 30న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారు. ఈ జాబితాలో చోటు దక్కినవారు వచ్చే ఏడాది జరుగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకొనే అవకాశం ఉంటుంది.

2019 ఎన్నికలో 4,315 మంది ఓటర్లు

2019లో జరిగిన వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికలో 4,315 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 2716 మంది పురుషులు, 1597 మంది మహిళలు, ఇద్దరు ఇతరులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే, ఈ సారి 5,595 మంది దరఖాస్తు చేసుకోవడంతో ఓటు హక్కు వినియోగించుకొనే వారి సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. డిసెంబర్ 30న తుది జాబితా వస్తుంది. కాగా, జిల్లాలోని 14 మండలాల నుంచి ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో నగర పరిధిలోని హనుమకొండ మండలంలో అత్యధికంగా 3,525 మంది ఉండగా, అత్యల్పంగా వేలేరు మండలంలో 19 మంది ఉన్నారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం

పంచకూట శివాలయ పునఃప్రతిష్ఠాపన వేడుకలు పరిసమాప్తం

పట్టు వస్త్రాలు సమర్పించిన మాజీ ఎమ్మెల్యే చల్లా దంపతులు

పట్టు వస్త్రాలను తీసుకువెళ్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి-జ్యోతి దంపతులు

ఆత్మకూరు, నవంబర్ 8 : దేశంలోని ఏకైక దక్షిణ ముఖ పంచకూట ఆలయ పునః ప్రతిష్ఠాపన మహోత్సవాలు మండల కేంద్రంలో శుక్రవారం పరిసమాప్తమయ్యాయి. ఆత్మకూరుతో పాటు చుట్టుపక్కల గ్రామస్తులు తరలిరావడంతో శివాలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయాన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి-జ్యోతి దంపతులు సందర్శించారు. శివపార్వతుల కల్యాణోత్సవానికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అలాగే పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్వామి వారికి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేద పండితుడు శివకిరణ్ శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో శివలింగాలు, పార్వతీ మాత, గణపతి, కుమారస్వామి, నవగ్రహాల విగ్రహాలను ప్రతిష్ఠించారు. యాగశాలలో హోమాలు నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. ఇనగాల చారిటబుల్ ట్రస్ట్